



### జరిగిన జగన్నాటకం

ఎడమ చేతిని ప్రముఖంగా వాడే సవ్యలంకలో కుడిచేతి పోరాటానికి మహాబసు అనే నాయకుడయ్యాడు బోసు. పేరలల్ వరల్డ్స్ లో ప్రయాణం వల్ల సారథి సవ్యలంకకి వెళ్ళాడని డా. నరసింహం తెలుసుకున్నాడు. మహాబసుపై దళాధిపతి చేసిన దాడిలో సుధాముడు మరణించాడు. వామదేవుడి గూఢచారి ఉదంతుడుతో రహస్య మార్గం ద్వారా రాజప్రాసాదంలో వామదేవుణ్ణి కలిసాడు మహాబసు. మహాబసు మరణించాడని నమ్మిన ద్వీప ఉద్యమాన్ని ఆపేయాలన్న ప్రయత్నం చెయ్యటం ఉగ్రకు నచ్చక పోవటంతో ఆమెను బంధించాడు. తానే ఆచార్య వేదాంతం అని డాక్టర్ నరసింహం చెప్పాడు. దళాధిపతి దాడిలో వామదేవుడు మరణించాడు.

- 26 –

"మరణశిక్ష" ఎలాంటి తటపటాయింపు లేకుండా స్పష్టంగా చెప్పాడామాటని ఉగ్ర.

ఏమాత్రం బెదరలేదు ద్వీప. చిన్నగా నవ్వింది.

"వెంటనే అమలు చెయ్యండి" కొనసాగింపుగా చెప్పి, వచ్చిన అనుచరుడి వైపు తిరిగాడు. "అందరినీ సన్నద్ధం చెయ్యమని సేనానాయకులకు చెప్పు. నేను ఇప్పుడే వెళ్ళి ఆ దళాధిపతిని ఎదిరిస్తాను" ప్రకటించి ముందుకు కదిలాడు. అనుచరుడు తెచ్చిన అశ్వం కళ్లాన్ని పట్టుకోని ఒక్క ఊపులో ఎగిరి కూర్చున్నాడు. అయితే ముందుకు వెళ్ళడానికి మాత్రం తటపటాయించాడు.

మరణశిక్ష విధించిన తరువాత ద్వీప ఏ మాటా మాట్లాడకపోవటం అతనికి ఆశ్చర్యంగానూ, అసహనంగానూ అనిపించింది. వెనక్కి తిరిగి ఆమె వైపు చూశాడు. ఆమె ముఖంలో చిరునవ్వు అలాగే వుంది. చూపు తీక్షణంగా వుంది. ఆ చూపు అతని కళ్ళలోకే వచ్చి గుచ్చుతోంది.

"శెలవు" అంటూ కుడిచేతి పిడికిలి చూపించి ముందుకు కదలబోయాడు. అప్పుడు మాట్లాడింది ద్వీప.

"నాకు మరణశిక్ష విధించడానికి నువ్వెవరు?"

ప్రశ్న వస్తుందని ఊహించాడు కానీ సమాధానం చెప్పలేక పోయాడు.

"మహాబసు మొదలుపెట్టిన ఈ పోరాటాన్ని ముందు తీసుకెళ్తున్న నాయకుణ్ణి"

"నాయకుడు.. " నిరసన ధ్వనిస్తూ పలికింది ద్వీప. "ఎవరికి నాయకుడు? నిన్ను ఎవరైనా నియమించారా? ఎవరైనా ఎన్నుకున్నారా? అయాచితంగా వచ్చిన అధికారంతో ఏం చేస్తున్నావో తెలియని ఉన్మాదావస్థలో వున్నావు. ఆ అధికారం ఏక్కడ లేకుండా పోతుందోనన్న భయంతో ఈ పోరాటాన్ని సాగిస్తున్నావు. అందుకు అడ్డం వచ్చిన నాలాంటి వాళ్ళని ఆహుతి చేస్తున్నావు. నీ అధికార దాహానికి. మదానికి నేను సమిధను. అంతేనా?"

"అధికారం కోసం కాదు. ఆశయం కోసం. ఆశయ సాధన కోసం. మరీ ముఖ్యంగా నేను నమ్మిన సిద్ధాంతం కోసం. ఇక శలవు" అంటూనే గుర్రాన్ని ముందుకు కదిలించాడు ఉగ్ర.

"అయితే నీకూ నువ్వు పోరాడబోతున్న దళాధిపతికి తేడా ఏంటి? నువ్వు నమ్మిన సిద్ధాంతం కోసం నన్ను చంపుతున్నావు. అతను నమ్మిన సిద్ధాంతం కోసం మహాబసుని చంపాడు." ద్వీప గట్టిగా అరిచి చెప్పిన మాటలు వినపడుతున్నా వినపడనట్లుగా ముందుకు కదిలాడు ఉగ్ర.

"మహాబసు మరణించలేదు" మనసులో పదే పదే అనుకుంటూనే వున్నాడతను.

సైన్యం సిద్ధంగా వుంది. ఉగ్ర అక్కడికి చేరుతూనే గట్టిగా అన్నాడు –

"మహాబసు మరణించలేదు"

అందరూ అతని వైపే చూశారు.

"మహాబసుకి మరణం లేదు."

మళ్ళీ అరిచాడతను.

"అతను నిరంతరం జీవించేలా యుద్ధం చేద్దాం. సిద్ధమా?" పిలుపునిచ్చాడు

"సిద్ధం" వందాలాది గొంతులు ఒక్కసారి పలికాయి.

"ఈ యుద్ధం తరువాత మనం జీవించి వుండకపోవచ్చు"

"సిద్ధం"

"ఈ యుద్ధం తరువాత మనం చిరంజీవులుగా జీవించవచ్చు"

"సిద్ధం"

"జయహో మహాబసు"

"జయహో మహాబసు"

దిక్కులు పిక్కటిల్లేలా అరుస్తూ సేన మొత్తం యుద్ధం భూమి వైపు కదిలింది.

అటు వైపు నుంచి దళాధిపతి దళం పొలాన్ని కమ్మేసిన మిడతల దండులా దూసుకొస్తోంది.

ఒకరికొకరు ఎదురుపడ్డారు. వికటంగా నవ్వాడు దళాధిపతి. ఉగ్ర కోపంతో రగిలిపోతున్నాడు.

దళాధిపతి తన ఖడ్గాన్ని తీసి ఉగ్ర వైపు చూపించాడు.

"చూస్తున్నావా ఈ ఖడ్గాన్ని. సవ్యలంక ధర్మశాస్త్రాన్ని కాదన్న ప్రతి గొంతుకనూ ఉత్తరించిన ఖడ్గమిది. ఈ రాజ్య శాసనాలను వ్యతిరేకించినది ఎవరైనా సరే వాళ్ళ తలను తెగ నరికేదాకా శాంతించని ఖడ్గమిది. ఇదిగో ఇంకా తడి ఆరని ఈ రక్తపు మరకలను చూస్తున్నావా? ఇవి ఎవరివో తెలుసా?" అడిగి గట్టిగా నవ్వాడతని.

ఈ పేరు వినాల్సివస్తుందో అన్న భయం ఉగ్రని అతలాకుతలం చేసింది. "మహాబసు మరణించలేదు" మళ్ళీ అనుకున్నాడు మనసులోనే.

"ఈ రక్తం వామదేవుడిది. మీ మహాధినేతది" ప్రకటించాడు ఉగ్ర.

ఆశ్చర్యపోయాడు ఉగ్ర. దళాధిపతి వామదేవుణ్ణి చంపడమేమిటి అని ఆశ్చర్యపోయారు అంతా.

"ఇప్పుడు మీకు మహాధినేత లేదు. ఉన్నదల్లా నేనే. నేనే దళాధిపతిని. మహాధినేతని" చెప్తూనే మళ్ళీ దళాధిపతి నవ్వాడు. "ఇక ఈ కరవాలం ఎదురుచూస్తున్న రుధిరం ఎవరిదో తెలుసా? మీ నాయకుడు మహాబసుది" అతని ఈ ఒక్క వాక్యం ఉగ్రలో అనేకానేక స్పందనలకు కారణమైంది.

అప్పటిదాకా వున్న ఆశ్చర్యం, అసహనం స్థానే ఆనందం విరిసింది. "అంటే మహాబసు బ్రతికేవున్నాడు" తనకి తానే చెప్పుకోని ఇంకా ఆనందించాడు మహాబసు.

"మహాబసు మరణం మీ ఉద్యమానికి చరమగీతం కావాలి. రా.... ముందు నిన్ను చంపి ఆ తరువాత మహాబసుని అంతం చేస్తాను"

అప్పటిదాకా ఉగ్ర మనసులో ఉన్న ఊగిసలాట ఆగిపోయింది. ఇప్పుడు స్పష్టమైంది. తాను నమ్మినదే నిజమని తెలిసిపోయింది. మహాబసు మరణించలేదు. కనీసం వామదేవుడి దగ్గర బందీగా కూడా లేదు. దళాధిపతి మాటల్ని బట్టి చూస్తే మహాబసు కోసం వాళ్ళు కూడా చూస్తున్నారు.

"జయహో మహాబసూ" అప్రయత్నంగా అరిచాడు.

"జయహో మహాబసూ" సేన మొత్తం ఉత్సాహంగా బదులిచ్చింది.

యుద్ధం మొదలైంది. ఆఖరి యుద్ధం. మహాధినేతని చంపి రాజ్య కాంక్షతో శత్రుశేషం లేకుండా చేయాలని యుద్ధం చేస్తున్న దళాధిపతికి, ఉగ్రని చంపేందుకు ఆఖరి అవకాశం. ఉద్యమానికి ప్రధాన శత్రువైన దళాధిపతిని చంపి, మహాబసుని మళ్ళీ చేరుకోడానికి ఉగ్రకి ఇదే ఆఖరి అవకాశం. ఇద్దరిలో ఎవరు మరణించినా, ఎవరు గెలిచినా ఇదే వారిరువురికీ ఆఖరి యుద్ధం. అలాగే పోరాడుతున్నారు ఇద్దరూ.

అటు దళాధిపతితో వందల్లో, వేలలో సైన్యం. ఇటు ఉగ్ర వైపు శత్రు సేనలో ఐదో వంతు కూడా లేని పరిస్థితి. అయితే వున్నదల్లా ధైర్యం. ఆత్మస్థైర్యం. నమ్మకం. ఆశయం. ఇవే విజయానికి బాటలు వేస్తాయన్న విశ్వాసం. అయితే ఎక్కడో ఏదో మూల ఉగ్ర మనసులో మిగిలిపోయిన బాధ ఒకటుంది. అది – ద్వీప.

ఉగ్ర సైన్యంలో సైనికులు ఒక్కొక్కరుగా నేలకి ఒరుగుతున్నారు. నేలకి ఒరిగిన ప్రతి ఒక్కడు కనీసం పదిమందిని చంపి తాను చస్తున్నాడు. అది చాలు. ఐదో వంతు సైన్యం, ఒక్కొక్కరు ఇలాగే పది మందిని చంపితే సగం సైన్యం మిగిలుండగానే శత్రు సైన్యాన్ని అంతం చేయచ్చు. కానీ అది కాదు ఉగ్ర కోరుకుంటున్నది. ఉగ్రకి కావాల్సింది దళాధిపతి మరణం. కానీ అదంత సులభం కాదని అర్థమౌతూనే వుంది.

దళాధిపతితో ముఖాముఖి తలపడే అవకాశం వచ్చింది. ఒకరి మీదకొకరు ఆయుధాలను వర్షంలా కురిపిస్తున్నారు. ఫలితం తేలనిస్థితిలో చాలాసేపు ఆ యుద్ధం కొనసాగింది.

ఉన్నట్టుండి దళాధిపతి మీదకు దాడి చేస్తున్న బాణాలను గమనించాడు ఉగ్ర. అవి తన విల్లు నుంచి వెలువడుతున్నవి కాదని అర్థమౌతూనే వుంది. ఆశ్చర్యంతో ఆ బాణాలు వస్తున్న వైపుకి చూశాడు ఉగ్ర.

ద్వీప!

కానీ అప్పటికే ఆలస్యమైపోయింది. దళాధిపతి వదిలిన బాణం అతని కుడి భుజాన్ని చీల్చుకుంటూ వెళ్ళిపోయింది. గుర్రం మీద నుంచి కింద పడిపోయాడతను. ద్వీప తన బాణ పరంపరని కొనసాగిస్తూనే ఉగ్ర దగ్గరగా వచ్చింది.

ఆశ్చర్యంగా ఆమెనే చూస్తూ — "ద్వీపా" అని మాత్రమే అనగలిగాడు ఉగ్ర.

"ఆచార్య వేదాంతం నన్ను విడిపించారు. నువ్వేం కంగారుపడకు నీకు తోడుగా నేనున్నాను" అంటూనే తన విల్లుని ఎక్కుపెట్టి బాణాలను వదులుతూనే వుంది.

ఉగ్ర సంభ్రమంగా చూస్తున్నాడు. తానే స్వయంగా మరణశిక్ష విధించి ఎంతో సమయం కాలేదు. ఇప్పుడు ఆమే అతని ప్రాణాలని కాపాడటానికి ముందుకు వచ్చింది. కృతజ్ఞతగా ఆమె వైపు చూశాడు.

"మహాబసు బ్రతికేవున్నాడు" ఆ విషయం ఆమెకు చెప్పకుండా వుండలేకపోయాడు.

ఆమె ఒక్క క్షణం చిగురుటాకులా వణికిపోయింది. ఆ ఒక్క క్షణం రణరంగంలో నిల్చోని వున్నానన్న సంగతి మర్చిపోయిందామె. శత్రువు బలం పుంజుకోడానికి ఆ ఒక్క క్షణం చాలు.

అప్పటిదాకా ఆమెతో ముఖాముఖీ యుద్ధం చేస్తున్న దళాధిపతి తప్పుకున్నాడు. అతని స్థానంలో అతని ముఖ్య అనుచరులు ముగ్గురు వచ్చారు. ద్వీప తేరుకునేలోగా వాళ్ళు తమ దాడిని మొదలుపెట్టారు. అసలు సమస్య అది కాదు. వాళ్ళు దాడి కొనసాగిస్తూ క్రమంగా దక్షిణం వైపు కదులుతున్నారు. అంటే వాళ్ళతో పోరాటం కొనసాగించడానికి ద్వీప ఉత్తరం వైపు కదలాలి. అంటే క్రమంగా ఉగ్రకి దూరం అయిపోవాలి. ఉగ్రని అలా వదిలేయడం ఇష్టం లేకపోయినా తప్పని పరిస్థితి.

శత్రువు వేసిన పన్నాగం అర్థమైంది ఉగ్రకి. దళాధిపతి అనుచరులు ద్వీపని తనకి దూరంగా తీసుకెళ్ళగానే అతను మళ్ళీ ముందుకు వస్తాడు. కుడి భుజంలో బాణం దిగడంతో యుద్ధం చెయ్యడం కష్టంగా వుంది. అంటే తనను చంపడానికే ఈ వ్యూహం వేశారు.

"నాకేమైనా ఫర్వాలేదు ద్వీపా. నీ యిద్ధం నువ్వు చెయ్యి. జయహో మహాబసు" గట్టిగా అరిచి నిలబడి అతి కష్టం మీద బాణాలు వెయ్యడం మొదలుపెట్టాడు. క్రమంగా ద్వీప దూరమైంది. దళాధిపతి ప్రత్యక్షమయ్యాడు.

అదే వికటాట్టహాసం చేస్తున్నాడు దళాధిపతి. మృత్యుదేవతలా వున్నాడు. ఉగ్ర వేస్తున్న బాణాలు అతనిని తాకలేకపోతున్నాయి. తాకినా ఎలాంటి ప్రభావమూ లేనంత సున్నితంగా తాకుతున్నాయి. బలమంతా ఉపయోగించినా దళాధిపతి కవచాన్ని కూడా ఛేదించలేకపోతున్నాయి. అతని పరిస్థితి అర్థమైంది దళాధిపతికి. అతను నెమ్మదిగా దగ్గరకు రాసాగాడు.

క్షణానికో అడుగు చొప్పున దగ్గరౌతున్న మృత్యువుని ఎలాంటి బెదురు లేకుండా చూస్తున్నాడు ఉగ్ర. చేతిలోని విల్లుని, బాణాలను పక్కన పడేశాడు. కరవాలాన్ని అందుకోని సిద్ధంగా వున్నాడు. దళాధిపతి కూడా కరవాలాన్ని దూసి చేత పట్టుకోని ముందు నిలబడ్డాడు.

ఉగ్ర రెండు చేతులతో కత్తిని పట్టుకోని దళాధిపతి మీదకి దాడి చేశాడు. దళాధిపతి కేవలం ఉగ్ర చేస్తున్న దాడిని తప్పుకుంటూ, తన కత్తిని అడ్డంపెడుతూ వుండిపోయాడు. ప్రతిదాడి చెయ్యటంలేదు. పులి తన పంజా దెబ్బ తిని పడిపోయిన లేడి పిల్లతో ఆడుకున్నట్లుగా వుందా సన్నివేశం.

అయినా ఉగ్ర తన ప్రయత్నం మానలేదు. దళాధిపతి చేతిపైన, వీపు పైన రెండు చిన్న గాట్లు మాత్రం పెట్టగలిగాడు. ఇక ఆట చాలనుకున్నాడేమో దళాధిపతి తన కత్తిని తిప్పుతూ ముందుకి ఉరికాడు. మరుక్షణం ఉగ్ర చేతిలోని కత్తి ఎగిరి పడిపోయింది.

ఇప్పుడు ఉగ్ర నిరాయుధుడు. దళాధిపతి కరవాలం అతని గుండెల మీద వుంది.

"ఆఖరి సారి ఊపిరి పీల్చుకో ఉగ్రా. నువ్వు నమ్ముకున్న నీ దేవుణ్ణి తల్చుకో." అంటూ తన కత్తిని పైకెత్తాడు.

ఇక మరణం తథ్యమని అర్థమైంది ఉగ్రకి. ఉత్తరం వైపు దూరంగా యుద్ధం చేస్తున్న ద్వీప వైపు చూశాడు. ఆమె తిరిగి వచ్చేందుకు అవకాశం లేదు. ఆఖరుసారి మహాబసుని తల్చుకున్నాడు. "నన్ను క్షమించు మహాబసూ" అనుకున్నాడు. కళ్ళు మూసుకోని మరణాన్ని ఆహ్వానిస్తూ వుండిపోయాడు.

"కళ్ళు తెరువు ఉగ్రా!" అరిచాడు దళాధిపతి. నేను నిన్ను నా ఎడమ చేతితో నరకడం నువ్వు కూడా చూడాలి. కళ్ళు తెరువ్"

ఉగ్ర కళ్ళు తెరిచాడు. దళాధిపతి రెండు చేతులతో పట్టుకున్న ఖడ్గాన్ని ఎడమ చేతిలోకి మార్చుకున్నాడు. దానిని ఒకసారి నెమ్మదిగా ఉగ్ర మెడ పైన తాకించి ఇక నరకడానికి సిద్ధమన్నట్లుగా పైకెత్తాడు.

ఒక్క క్షణం యుద్ధభూమిలో వున్న ప్రతి ఒక్కరి శ్వాస ఆగిపోయాయి.

(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)

COMMENTS